# ఉసురు

ఏ. వి. సీతారామయ్యగారు ఎం. ఏ.,

అధికారంరాగానే కళ్లుతిరిగిపోతాయి ఎవరికయినాసరే. ఇక ఎప్పుడూకూడా అదేవిధంగా వుంటా ననుకుంటాడు మానవుడు. ఏవిధంగావచ్చిందో ఆవిధంగానే పోతుందన్నసంగతిగుర్తించడు.

* * *

చేర్మెనుగదాఅని చెప్పుకోవచ్చింది ముశిలి పాపం.

* * *

అందరూ ముశలనేఅంటారు. దానిఅసలుపేరు యవరికీతెలీదు. యాభైఏళ్లుంటయి. దానికికొడుకులుగాని, కూతుళ్లుగానిలేరు. అసలుబంధువులెవరయినా వున్నారోలేదోకూడా సందేహమే. ఏకాకిఅని చెప్పొచ్చు. బస్తీకి ఐదుమైళ్ళదూరంలోవున్న పల్లెనుంచివచ్చింది చింతచిగురమ్ముకోటానికి. ఏదోవకపావలా డబ్బులొస్తే రెండురోజులు కాలక్షేపంజేయవచ్చుగదాఅని. పడుచుముండలమధ్య యంతకష్టపడి సేకరించిందో ఆచిగురు.

ఊళ్లోకాలుపెట్టీపెట్టడంతోనే మార్కెట్టుకంట్రాక్టరుగుమాస్తాపట్టుకొన్నాడు 'కానీ' తెమ్మని. తిరుగుతూ అమ్మేదానివద్ద ఆవిధంగా జులుంచేశి తీసికోటానికి వీడికిహక్కులేదు నిజానికి. కాని యవరుదీని తరఫునవాదించి ఆతలబిరుసుగుమాస్తాను మందలించగల్గినవారు? ఏకార్మికసంఘానికి అధ్యక్షుడుగానో యెన్నుకుంటే వాళ్ళకెవరికీ అర్థంకాకుండా ఇంగ్లీషులో ధణుతెగిరేటు లెక్చర్లివ్వగల కార్మికనాయకులనేకమంది. ఇటువంటివిషయంగనక యక్కడయినాతటస్థిస్తే భర్రున సైకిల్‌మీద దాటిపోతారు.

తనదగ్గర కానీఅయినా లేదనిచెప్పిందిముశిలి. కొంచెంఅమ్ముకునియిస్తానంటె. బ్రతిమిలాడింది. రెండు రోజులనుంచి కూడూనీళ్లూకూడాలేకుండా కోశినచిగురని దీనంగాయేడ్చింది. చిగురుకోశేప్పుడు ఆకొమ్మలు తగిలి దోక్కుపోయినగాయలుచూపింది. 'చిగురుకొంచెంఅమ్ముకోగానే తప్పకుండాయిస్తా నాయనా!' అని ఆక్రోశించింది. 'దిక్కులేనిముసలిముండని. కనికరించాలి' అని ప్రాధేయపడ్డది. వేటతెగేశే కటికవాడికా జాలి! ఒకప్పుడు వాడికయినాకలుగుతుందేమో!

'ఏడ్చావులే యీవేషాలు నాదగ్గర పనికిరా'వన్నాడు. 'అనవసరంగా తన్నులుతింటావ్. తే కానీ' అని గద్దించాడు. కళ్లుయర్రచేశాడు. చొక్కాచేతులువెనక్కిలాగాడు. హుంకరించాడు. కేకలువేశాడు. నానాగడబిడచేశాడు.

దీనంగాయేడుస్తూ అట్లానే నుంచుంది ముశిలి వణుకుతూ. కాలుస్తున్నబీడీ అవతలపారేశి చిగురుతట్ట మీద వకతన్నుతన్నాడుగుమాస్తా. అదియెగిరెళ్ళి మురుగుకాలవలో పడిపోయింది. రోడ్డంతాచిగురుమయం. అంతటితో పోలేదు గుమాస్తాకోపం. ముశిలిజుట్టుపట్టుకొని జరజరయీడ్చాడు ఆకంకరరోడ్డుమీద. ముశిలి చేతులూకాళ్లూకొట్టుకుపోయి, రక్తమయమయింది. ఎలుగెత్తియేడుస్తుందిముశిలి.

'క్యాకర్‌రహేహోతుంపద్మాష్' అంటూ వకసాహెబొచ్చాడు. నలుగురూమూగారు. ముశిలినివదలి నిలువబడ్డాడుగుమాస్తా. కోపంమాత్రం ఆతడ్నివదిలిందికాదు. పదిమందీకలిశి యిద్దర్నీ చేర్మెనుగారివద్దకు తీసుకపోయారు. మట్టిలోకలిశిపోయిన ఆచిగురుకొంతవరకు తనరుమాల్లోపోగుచేసి ముసిలిచేయిపట్టుకొని ముందు నడచాడు సాహెబు-చేర్మెను గారికిచూపిద్దామని.

* * *

ఎటువంటికఠినహృదయుడికయినా కంటనీరుతెప్పిస్తుంది ముశిలిదృశ్యం. చేర్మెనుగారుమాత్రం తొణకకుండా నిశ్చలంగాకూర్చున్నాడు చుట్టకాల్చుకుంటూ. చేర్మెనుగారితో మాట్లాడుతూకూర్చున్న వారిమిత్రుడుమాత్రం నిర్ఘాంతపోయాడు. కళ్ళవెంబడి నీరు గిర్రునతిరిగింది. దయారసపూరితమయినది మానవహృదయం. గుమాస్తాకు నాలుగురూపాయిలు జుల్మానావేశి అది ముశిలికిప్పిస్తే బాగుంటుందని మనవిచేశాడు. సాహెబు మొదలయినవారంతా 'భేష్' అన్నారు. కాని స్నేహితుడిసలహాకూడా తోశివేశి 'ఆలోచిస్తాంలే. వెళ్ళండి' అన్నారు చేర్మెనుగారు. చేర్మెనుగారుగదాఅని యేదోచెప్పబోవచ్చింది ముశిలియేడుస్తూ. 'గోల చేయకపోవే' అన్నారు ముశిలితో చేర్మెనుగారు కఠినంగా.

అప్పటికీ ఏదో గొణగ నేగొణిగిందిముశిలి. గుమాస్తాదానివంక బింకంగాచూచాడు తనతాత్కాలిక జయానికి. ముశిలికివొళ్ళుమండింది. 'నాలాంటిముసలిదాన్నికొట్టిన నీచేతులెన్నాళ్ళుంటయిలేరా' అనితిట్టింది. ముశిలినిబయటకుతీసుకుపొమ్మని చేర్మెనుగారుకోప్పడ్డారు. వారిముందే ఆసాహెబు-కుట్టుపనిచేనుకుండే ఆసాహెబు-వకరూపాయి తనవెస్టుకోటుజేబులోనుంచితీసి దానిచేతిలోపెట్టి బయటకుతీసుకుపోయాడు. అందరూవెళ్ళిపోయారు చేర్మెనుగారిప్రవర్తనకు నిరసనజూపుతూ. ఆయనయిబ్బందులేమిటో?

*　　　　*　　　　*

కాలచక్రం గిర్రునతిరుగుతోంది. కింకరుడే రాజౌతూన్నాడు. రాజే కింకరుడౌతున్నాడు. ఏనాటి కేదియెట్లాజరగాలో అది ఆవిధంగా జరగకమానదుగదా!

*　　　　*　　　　*

ప్రజలంతా చెప్పుకో మొదలెట్టారు వకబీదముసలిదానికి లాటరీలో లక్షరూపాయిలొచ్చాయటని. ఆముసలిదెవరాఅని విచారణచేస్తే ఆనాడు మార్కెటుగుమాస్తాచేతిలో దెబ్బలుతిన్న చింతచిగురుఅమ్మకునే ముశిలేనని తెలిశింది.

ఆనాడు సాహెబిచ్చినరూపాయితో లాటరీటిక్కెటొకటికొన్నది. భగవంతుడు లక్షరూపాయిలనుగ్రహించాడు దిక్కులేని ఆబీదముసలిదానికి.

మళ్ళీ బస్తీకివచ్చిందిముశిలి. చింతచిగురమ్మకోటానికిగాదు. మొక్కుబళ్లువగైరాలు తీర్చుకోటానికి. దోవలో తానానాడు దెబ్బలుతిన్నస్థలందగ్గర వక్కక్షణంఆగింది. ముందునదిలోస్నానంచేశి మరీబయలుచేరాలనుకొని సాగిపోయింది.

*　　　　*　　　　*

నీళ్ళలోదిగి వకబుటకవేశిందోలేదో బ్రాహ్మ డొకడుసంకల్పం ఆరంభించాడు. ఎవరయితేనేమిలెమ్మని ముశిలి బ్రాహ్మడు చెప్పినట్లల్లచేస్తుంది. బ్రాహ్మడు అటూయిటూ దిక్కులుచూస్తూ మొత్తంమీద సంకల్పం అయిందనిపించాడు. చివరకి దక్షిణివ్వవచ్చిందిముశిలి. 'పిల్లలుగలవాణ్ణి. అమ్మా! కనికరించాలి' అన్నాడు దీనంగా. ముశిలి పైకిచూచింది. నిర్ఘాంతపడిపోయిరది. బ్రాహ్మడు చాచినచేయితీశాడు చేర్మెనుగారుఅన్నది అప్రయత్నంగా. పదిరూపాయిలతనిచేతిలోపెట్టి వెళ్ళిపోయింది గప్‌చిప్‌గా.

*　　　　*　　　　*

ఆనాడట్లాజరిగినతర్వాత చేర్మెనుగారిమీద విశ్వాసరాహిత్యతీర్మానం రావడం, తనపదవినిలుపుకోటానికి అంతాతగలేసుకుని యీవిధంగా నీరుకానులుపట్టేస్థితికిరావడం వగైరావిషయాలు ముశిలికితెలీవు.

*　　　　*　　　　*

దోవలో సాహెబొకడు కన్పించాడు మురిలికి. ఒకరినొకరుగుర్తించారు. మురిలి తనకథఅంతా చెప్పింది. పదివేలుఆతనిపేరట 'బ్యాంకీ'లో వేశినట్లుగా కూడా చెప్పింది. వద్దన్నాడుసాహెబు. కాదు పుచ్చుకోమందిమురిలి. ఆనందాశ్రువులురాలుస్తూ వెళ్ళిపోయాడు సాహెబు.

*　　　　*　　　　*

దేవాలయందాపుకువచ్చిందిమురిలి. రోడ్డుకురెండువైపులా ముష్టివాళ్లుకూర్చున్నారు. వికలాంగులు, వికృతాంగులు, గ్రుడ్డివారు మొదలయిన అనేకరకాలవారు గోలగాకేకలువేస్తూ వచ్చేపోయేవారిని యాచిస్తున్నారు. ఒక్కొక్కరికి అణాబేడా యిస్తూవస్తున్నది మురిలి. 'అమ్మా' అని రెండు మొండిచేతులుచాచాడు వకకుంటివాడు. 'ఎందువలన నీచేతులిట్లాఅయినయి' అని అడుగుతూ ఆతనిముఖంవంకచూశి స్తంభించిపోయింది మురిలి. వాడుకూడా చకితుడయిపోయాడు. తనమొండిచేతుల్ని వెనక్కితీసుకున్నాడు. ఆచేర్మను పోగానే తనను వుద్యోగంలోనుంచి తీసివేశారనీ, తరువాత తానొకముద్రాలయంలో పనిచేస్తుండగా వకనాడు తనచేతులు యంత్రంలోపడి నలిగిపోయినాయనీ దానిమీద ముద్రాలయాధికారులు తననుపనిలోనుంచి తొలగించారనీ చెప్పుకొచ్చాడు కళ్ళవెంబడి నీరుకారుస్తూ. మురిలికిగూడా కళ్ళవెంబడి నీళ్ళువచ్చినయి. రొండినుంచి వక ఇరవైరూపాయీలు తీసియిచ్చిందివాడికి. ఏమోచెప్పబోయాడు. ఇంతలో దేవాలయంలోకి అదృశ్యమయిపోయింది మురిలి. వాడుకూడా మురిలిపోయిన దిక్కేచూస్తూ నిలువబడిపోయాడు ప్రతిమమాదిరి.

## శారదాగమము

శ్రీమతి కొరప్రోలు వేంకటరంగమ్మగారు

పృథ్వికొకవింతకాంతిని పొందుపరచి
సలిలమునకును నైర్మల్యసరణిఁగూర్చి
పావకుని నూత్నకాంతుల పట్టుజేసి
పవనునకు మృదులోర్ములు పదిలబరచి
విగతజలధరమగు వ్యోమవీధినిండి
చంద్రకాంతి దువ్వలువపై చెలఁగుజార
తారహారంబు లురముపై తాండవింప
చారుఘనసార చందనచర్చమెరయ
వికచనవమల్లికాదామవిభవమమర
కాశసుమచామరంబులు గ్రాలుచుండ
హంససారసగానంబు లలరుచుండ
కమలకల్హారకైరవగరిమమెఱయ
మధురసంగీతషట్పదమహిమదనర.
చివురుకెంగేలుపై వేడ్క చెన్నుమీరు
బాలభాస్కరకరకాంతి పరిఢవింప
బ్రహ్మవంశ్యులు వేదతత్పరతమెలఁగ
రాజరాజులు నీరాజరాజినొసఁగ
వసుధ నవరత్నమాలలు వైశ్యులిడఁగ
నిత్యపరిచర్యసేవకు ల్నెఱపుచుండ
విల్లుఁదమ్ములుపట్టుకు వేడ్కమీఱ
బాలబాలిక లట బరాబరులుసేయ
నెచట జూచిన నీపూజ లెసఁగుచుండ
నెచటఁజూచిన నీమూర్తి యలరుచుండ
నెచటఁగాంచిన నీశక్తి యమరుచుండ
విశ్వమంతయు నీవయై వెలుఁగుచుండి
భారతీయుల కఖిలసౌభాగ్యమిడఁగ
అరుగుదెంచెదుమాత! ఓయమృతపూత!
శారదాదేవి! నీకిదే స్వాగతంబు.